దసరా, అమ్మవారి పండగలకు
ఆర్‌టిసి ఆదాయం రూ.27 లక్షలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

దసరా, ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా జిల్లా నుంచి నడిపిన ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసులు ద్వారా రూ.27 లక్షలు ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. దసరా సందర్భంగా 35 బస్సులను ప్రత్యేక సర్వీసులుగా విజయవాడ, భీమవరం హైదరాబాద్ ప్రాంతాలకు మూడు రోజులు పాటు నడిపామని తెలిపారు. తద్వారా రూ.12లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. విజయనగరం ఉత్సవాలతో పాటు, అమ్మవారి పండగ నేపథ్యంలో 73 ప్రత్యేక సర్వీసులు నడపగా, ఈ బస్సులు 29వేల కిలోమీటర్లు ప్రయాణించాయని, రూ.15లక్షలు ఆదాయం వచ్చిందని తెలిపారు.ఆర్‌టిసిని ఆదరించిన ప్రయాణికులకు ధన్యవాదాలు తెలిపారు.

డయేరియా వ్యాప్తిపై ప్రత్యేకాధికారి విచారణ

- ఎస్ఎస్ఆర్‌పేటలో తాగునీటి పథకం, గుర్లలో మురుగునీటి కాలువలు పరిశీలన
- ఆసుపత్రిలో వైద్య చికిత్సపై ఆరా
- కలెక్టరేట్‌లో అధికారుల నుంచి సమాచారం సేకరణ

అధికారుల నుంచి సమాచారం సేకరిస్తున్న ప్రభుత్వ ప్రత్యేకాధికారి కె.విజయానంద్

ప్రజాశక్తి-గుర్ల, విజయనగరం ప్రతినిధి

గుర్ల మండల కేంద్రంలో డయేరియా ప్రబలి పలువురి మృతికి దారితీసిన ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఎఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం విచారణ చేపట్టారు. కలెక్టర్ కార్యాలయంలో ముందుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఇతర జిల్లా అధికారులతో మాట్లాడి తాగునీరు కలుషితం కావడానికి కారణాలు, ఆ గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు, డయేరియా బాధితులకు అందించిన వైద్య సహాయం తదితర అంశాలపై సమగ్రంగా సమాచారం సేకరించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో గుర్ల గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని పారిశుధ్యాన్ని, తాగునీటి పైప్ లైన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నీటి సరఫరా గురించి అధికారులను అడిగి తెలుసు కున్నారు. అంతకుముందు నెల్లిమర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేట తాగునీటి పథకాన్ని ఆయన సందర్శించారు. ఊటబావులు, నీటి సరఫరా, క్లోరినేషన్ ప్రక్రియలను, చంపావతి నదీ జలాలను పరిశీలించారు. గ్రామీణ నీటి సరఫరా సిఇ బి.హరేరాం నాయక్, ఎస్ఇ బి.ఉమాశంకర్ తాగునీటి పథకం గురించి వివరించారు.

ఇతర ప్రాంతాలనుండి తాగునీరు తెచ్చి అందించినప్పుడు డయేరియా తగ్గు ముఖం పట్టాలి కాదా అని అని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రశ్నించారు. డిఎంహెచ్ఒ బదులిస్తూ వ్యక్తి లో ఉన్న రోగనిరోధక శక్తి ని బట్టి 5 రోజుల లోపు వ్యాధి లక్షణాలు బయట పడతాయన్నారు. అనంతరం గ్రామంలోకి వెళ్లి తాగునీరు పైపులైన్లను పరిశీలించారు. మురుగు కాలువల పక్కన తాగునీటి పైపులు వేయడం సరికాదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఉద్దేశించి అన్నారు. అనంతరం గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డయేరియాకు చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యంపై ఆరా తీశారు. డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఇతర వైద్యులతో మాట్లాడారు. రోగులకు ఇస్తున్న మందులు, ఫార్మసీ విభాగాన్ని విజయానంద్ పరిశీలించారు. పర్యటనలో ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృధ్వితేజ, జాయింట్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్, ఆర్‌డిఒ బి.సత్యవాణి, తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంతకుముందు కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా వివిధ స్థాయిల్లో గుర్ల మండలంలో అందుబాటులో వున్న వైద్యాధికారులు, సిబ్బంది వివరాలను డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు ద్వారా తెలుసుకున్నారు. గుర్లలో డయేరియా ప్రబలడానికి ముందే ఆ మండలంలోని పరిసర గ్రామాల్లో నమోదైన డయేరియా కేసుల సమాచారం కూడా తెలుసుకున్నారు. కేసులు బయట పడిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖ స్పందించిన తీరు, అందించిన వైద్యసహాయం తదితర అంశాలపై ఆరా తీశారు. గుర్లలో మొదట కేసు ఎప్పుడు బయట పడిందీ, ఎంత వ్యవధిలో వైద్యసహాయం అందించిందీ తదితర వివరాలు తెలుసుకున్నారు. తాగునీటి నాణ్యతపై జరిపిన ల్యాబ్ పరీక్షల్లో డయేరియా వ్యాప్తికి కారణమైన బాక్టీరియా వున్నట్టు తేలిందని డిఎంహెచ్ఒ తెలిపారు. ఎస్.ఎస్.ఆర్.పేట తాగునీటి పథకం నుంచి సరఫరా అయిన నీరు ఏమైనా కలుషితం అయ్యే అవకాశం వుందా అనే అంశంపై గ్రామీణ నీటిసరఫరా ఎస్.ఇ. ఉమాశంకర్‌ను ఆరా తీశారు. తాగునీటి పైపులైన్ల లీక్ వల్ల కూడా నీరు కలుషితం అయ్యే అవకాశం వుందని, డ్రెయిన్లలో వున్న పైపులైన్లను వెంటనే తొలగించి వాటిని మార్చాల్సి ఉందని తెలిపారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను ఎన్ని రోజులకోసారి శుభ్రపరుస్తున్నారని ప్రశ్నించారు. గ్రామంలో బహిరంగ మలవిసర్జన జరుగుతున్నట్టు తెలిసిందని, గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని కుటుంబాలు ఎన్ని ఉన్నాయని డిపిఒను ఆరాతీశారు. భవిష్యత్తులో గుర్ల వంటి డయేరియా ఘటనలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలను సూచిస్తూ నివేదిక ఇవ్వాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణిని డయేరియా ప్రబలిన అంశంపై అడిగి తెలుసు కున్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, గ్రామీణ నీటిసరఫరా చీఫ్ ఇంజనీర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ఎస్ఎస్ఆర్‌పేటలో నీటి పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవంబర్ 16,17 తేదీల్లో
సిపిఎం 10వ జిల్లా మహాసభ

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నవంబర్ 16,17 తేదీల్లో విజయనగరంలో జరగనున్న సిపిఎం 10 వ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభల సందర్భంగా నగరంలో ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతాయని తెలిపారు. మూడేళ్లకొకసరి జరిగే ఈ మహాసభల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు ఉపయోగపడ్డాయా? నష్టం కలిగించాయా? వాటి ఫలితాలు, సిపిఎం చేసిన పోరాటాల కృషిని చర్చిస్తామని తెలిపారు. జిల్లాలో ముఖ్యమైన సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటామని తెలిపారు. ఇప్పటికే పార్టీ శ్రేణులు కింద స్థాయిలో సమావేశాలు పెట్టి మహాసభలకు సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో కేంద్రంలో ఎన్‌డిఎ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం, నేడు కూటమి ప్రభుత్వాలు ఒక తానులో ముక్కల్లా పాలన సాగిస్తున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు తీవ్రనష్టం కలిగిస్తున్నాయన్నారు. దేశంలో మతం, హిందుత్వం పేరుతో ప్రజలను ముక్కలు చేసే ప్రయత్నం మోడీ చేస్తున్నారన్నారు. నేడు జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు కావడం లేదన్నారు. మరో వైపు జిల్లాలో అతిసార ప్రభావం ఏవిధంగా ఉందో గుర్లలో జరిగిన ఘటన అర్థం అవుతుందన్నారు. జిల్లాలో ఉన్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించి మహాసభలో నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు. రెండు రోజులు పాటు జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి రమణ, వి.లక్ష్మి పాల్గొన్నారు.

మహిళా పోలీసులు క్రియాశీలకంగా పని చేయాలి

ఎస్‌పి వకుల్‌జిందాల్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-గజపతినగరం

మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత గ్రామాల పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా పని చేయాలని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళ వారం స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించి, మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత గ్రామాల పోలీసు సిబ్బందితో సమావేశ మయ్యారు. గ్రామ స్థాయిలో జరుగుతున్న నేరాలు, శాంతిభద్రతల సమస్యలు, బెల్టు షాపులు, గంజాయి వినియోగదారులు, విక్రయదారుల సమాచారాన్ని సేకరించి, సంబంధిత పోలీసు అధికారికి అందించాలన్నారు. గ్రామ స్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలు గురించి, అసాంఘిక కార్యకాపాలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగా సేకరించి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. సైబరు మోసాలు, డిజిటల్ అరెస్టు, గంజాయి, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను, రోడ్డు సేఫ్టీ, మహిళా రక్షణకు సంబంధించి ప్రజలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సైబరు మోసానికి గురైతే 1930కు లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తమ గ్రామ పరిధిలో నివసించే పాత నేరస్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు, వారు చేస్తున్న వృత్తులు, వారి ప్రస్తుత నడవడిక, జీవన విధానం గురించి పూర్తి సమాచారం తెలుసుకొని, అధికారులకు ఎప్పటికపుడు తెలియ జేయాలన్నారు. పోలీసు సిబ్బందికి కేటాయించిన దత్తత గ్రామాన్ని వారంలో ఒకరోజు సందర్శించి, గ్రామంలో పరిస్థితులను అధికారులకు నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, గజపతినగరం సిఐ జి.ఎ.వి.రమణ, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, ఎస్ఐలు కె.లక్ష్మణరావు, యు.మహేష్, రాజేష్, ఆర్.జయంతి, ఇతర పోలీసు అధికారులు, మహిళా సంరక్షణ పోలీసులు పాల్గొన్నారు.

పెద్ద చెరువులో నిర్వహిస్తున్న తెప్పోత్సవం

ఘనంగా పైడితల్లమ్మ తెప్పోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం సాయంత్రం పెద్దచెరవులో ఘనంగా జరిగింది. వేదమంత్రాలు నడుమ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న వనంగుడి నుంచి అమ్మవారి విగ్రహాన్ని పల్లకిలో ఊరేగిస్తూ సున్నపు బట్టి వీధి గుండా పెద్ద చెరువుకు పడమర దిక్కున ఉన్న మరిడిమాంబ గుడి వద్దకు తీసుకొచ్చారు. అనంతరం తెప్పలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి పడమర, తూర్పుకు మూడు సార్లు తెప్పోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో చెరువు గట్టు వద్ద నుంచి చూసేందుకు అవకాశం లేకుండా పోలీసులు బారికేడ్లు, తాళ్లతో కట్టి ఆటంకం కలిగించారు. దీంతో భక్తులు పోలీసుల తీరుపై మండిపడ్డారు. చేసేది లేక చాలా మంది నిరాశతో వెనుతిరిగారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ ప్రసాదరావు, పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే డయేరియా మరణాలు

ప్రజలను కాపాడుకునేందుకు కలిసి రండి

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గుర్ల పరిసర ప్రాంతాల్లో సంభవించినవి సహజ మరణాలు కాదని, ప్రభుత్వ వైఫల్యం కారణంగా డయేరియా విజృంభించడం వల్లే మృతి చెందారని జెడ్‌పి చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జెడ్‌పి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో డయేరియా మరణాలు ఆగే పరిస్తితి కనిపించడం లేదన్నారు. సోమవారం మూడు మరణాలు సంభవించాయని, మరి కొన్ని గ్రామాల్లో బాధితులు పెరుగుతున్నారని తెలిపారు. గజపతినగరం మండలం కెంగువ గ్రామానికి డయేరియా విస్తరించిందన్నారు. వ్యాధిని నియంత్రించడంలో పాలకులు విఫలమయ్యారని అన్నారు. అధికారులు, పాలకుల మధ్య సమన్వయం లేదనడానికి ఇంతకంటే మరో నిదర్శనం లేదన్నారు. నాగ ళ్లవలస , గూడెం, కెంగువ గ్రామాల్లో ప్రజలు బయటకు వచ్చే పరిస్తితి లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనలో జిల్లాకు ఆగౌర పరిచే సంఘటనలు జరిగాయన్నారు. వాటిని సమయం వచ్చినపుడు చెబుతామన్నారు. ప్రజాప్రతినిధులకు, ప్రజలకు సంబంధాలు తెగిపోయాయి అనడానికి నిన్న జరిగిన సంఘటనలే నిదర్శనమన్నారు. నీరు కలుషితం అవ్వడం వలన మరణాలు జరిగాయని తాము చెప్పిందే నిజమని తేలిందన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని కోరారు. త్వరలో జరగనున్న జెడ్‌పి సమావేశంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించేలా తీర్మానం చేసి పంపించేందుకు సహకరించాలని మంత్రులు, ఎమ్మెల్యేలను కోరారు. జిల్లా ప్రజలను కాపాడుకునేందుకు, మరణాలు నివారించేందుకు తగిన సిఫార్సులు చేసి చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి నివేదించాలని, అందుకు సహకరించాలని కోరారు. అందరం సమన్వయంతో పని చేసి ప్రజల ప్రాణాలను కాపాడుతామని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌పై గ్రామస్థాయి కార్యాచరణ

ప్రజాశక్తి-విజయనగరకోట

మహిళలను అక్షరాస్యులను చేసేందుకు ఉద్దేశించి ఉల్లాస్ కార్యక్రమంలో అందరూ పాల్గొని గ్రామస్థాయిలో కార్యాచరణ తయారు చేయాలని డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి తెలిపారు. మంగళవారం మహిళా ప్రాంగణంలో ఎపిఎంలు, డిఆర్‌డిఎ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంఇఒలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిడిపిఒలు, అన్ని మండలాలలో గల మండల విద్యాశాఖాదికారిలు, అంగనవాడీ పర్యవేక్షకులు, విఒఎలు, సిసిలతో జూమ్ సమావేశం నిర్వహించారు. వయోజన విద్య ఉపసంచాలకులు అల్లు సోమేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం ఉద్దేశాన్ని గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని తెలిపారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఎస్‌హెచ్‌జి గ్రూపుల్లో గల అక్షరాస్యులైన సభ్యులతో 10 : 1 నిష్పత్తిలో మ్యాచింగ్ బ్యాచింగ్ నిర్వహించి గూగుల్ షీట్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు. డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ సర్వే, మ్యాచింగ్ బ్యాచింగ్‌ను నిర్ణీత కాలంలో పూర్తి చేసి అందజేయాలని తెలిపారు.కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, వయోజన విద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో 'గురజాడ' విద్యార్థికి పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర స్కూల్ గేమ్స్ సందర్భంగా ఈనెల 6న తిరుపతిలో నిర్వహించిన అంతర్ జిల్లాల తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో గురజాడ పాఠశాలకు చెందిన 10 వ తరగతి విద్యార్థిని వై.కారుణ్య రాష్ట్ర స్థాయి తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం పొందింది. ఈ సందర్భంగా కారుణ్యను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిజిఆర్ కృష్ణాజీ, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు పి. సన్యాసి నాయుడు అభినంధించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యుత్తు ఉద్యోగులకు ఛాంపియన్ షిప్

ఇటీవల నెల్లూరులో జరిగిన ఇంటర్ సర్కిల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టీమ్ ఛాంపియన్ షిప్‌లో జిల్లాకు చెందిన విద్యుత్తు ఉద్యోగులు ద్వితీయ స్థానం సాధించారు. టీమ్ ప్లేయర్స్ పి. పైడిరాజు, బి.సింహాచలం,వై.ఓంకార్,బి.లోకేష్‌లను సర్కిల్ అధినేత విద్యుత్ శాఖ ఎస్ఇ ముప్పల లక్ష్మణరావు, అధ్యక్షులు ఇఇ పి.త్రినాధరావు, ప్రెసిడెంట్..పి.త్రినాధరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ వి.రాంబాబు .గణాంక అధికారి ఎస్.నరసింగరావు, తదితరులు అభినందించారు.

25న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

విజయనగరం : జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం అక్టోబరు 25వ తేదీ ఉదయం 11 గంటలకు విజయనగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని సి.ఇ.ఓ బి.వి.సత్యనారాయణ తెలిపారు.

కెంగువలో ఆర్‌డిఒ పరిశీలన

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని కెంగువ గ్రామంలో సోమవారం ఆరుగురు డయేరియా బారిన పడడంతో బొబ్బిలి ఆర్‌డిఒ జెవిఎస్ఎస్ రామ్మోహనరావు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. ఎప్పటిలాగే ప్రతిరోజు పారిశుధ్య పనులు చేపట్టాలని, డయేరియా ప్రబలకుండా నివారణకు రోగులకు అవసరమైన మందులు అందించాలని ,గ్రామంలో కుళాయి నీటిని కొన్ని రోజులు నిలుపుదల చేయాలని అధికారులు సూచించారు. ఆయన వెంట ఎంపిడిఒ బి.కల్యాణి, తహశీల్దార్ రత్నకుమార్, ఇఒపిఆర్‌డి. చల్లా.సుగుణకరావు, జెడ్‌పిటి సి గార తవుడు, వైసిపి నాయకులు బెల్లాన త్రినాథ్, మరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

పంచారామాల సందర్శనకు ప్రత్యేక బస్సులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌టిసి అధికారులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రానున్న కార్తీక మాసంలో పంచారామాల సందర్శన క్షేత్రాలుగా పేరుగాంచిన అమరావతి (అమరేశ్వరుడు), పాలకొల్లు (క్షీరరామలింగేశ్వరుడు), భీమవరం(సోమేశ్వరుడు), ద్రాక్షారామం(భీమేశ్వరుడు), సామర్లకోట (కొమరలింగేశ్వరుడు) పుణ్యక్షేత్రాలను సందర్శించే విధంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ప్రజారవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ తెలిపారు. సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంగళవారం డిపిటిఒ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్తీక మాసంలో ప్రతి ఆదివారం నవంబరు 3, 10, 17, 24తేదీల్లో సాయంత్రం 4గంటలకు డిపో నుండి బయలుదేరి మంగళవారం వేకువజామున తిరిగి విజయనగరం చేరుకుంటారని తెలిపారు. పూర్తిగా బస్సును బుక్ చేసుకొనే బృందాలుగా వెళ్లే భక్తుల సౌకర్యార్థం వారు ఎక్కే ప్రదేశానికి బస్సు పంపుతామని తెలిపారు. టిక్కెట్ల కోసం www.apsrtconline.in లాగిన్ అయి ఆన్‌లైన్ ద్వారా లేదా మీదగ్గరలో ఉన్న డిపోకి వెళ్లి టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. సూపర్ లగ్జరీకి రూ. 2వేలు, ఆల్ట్రాడీలక్స్‌కు రూ1950 ఛార్జీ ఉంటుందన్నారు. అలాగే అయ్యప్పస్వామి దర్శనార్థం కూడా బస్సులు ఇవ్వనున్నట్లు తెలిపారు. విశాఖ దర్శిని, ఆరుకు దర్శిని, పుణ్యగిరి, లంబసింగి, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, టెక్కలి రావివలస మొదలగు క్షేత్రాలకు పిక్నిక్ కోసం బస్సులు అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9494331213, 9959225620, 7382921380 నెంబర్లను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజరు. జె. శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు బి.ఆదినారాయణ, ఎంఎస్‌పి తదితరులు పాల్గొన్నారు.

నీటి పంపిణీలో అప్రమత్తం : కమిషనర్

వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నీటి పంపిణీ విధానంలో లోటుపాట్లు లేకుండా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలనినగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు వాటర్ ట్యాంకులను పరిశీలించారు. గుర్ల ప్రాంతంలో ప్రబలిన డయేరియా నేపథ్యంలో ఇతర ప్రాంతాలలో కూడా సోకే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులు పరిశుభ్రపరిచే కార్యక్రమాన్ని ఇప్పటికే ముమ్మరం చేశారు. ఆయా ట్యాంక్ ల పరిశుభ్రత విధానం ఏవిధంగా ఉందో కమిషనర్ పరిశీలించారు. అవసరమైన ముందస్తు జాగ్రత్తలను సిబ్బందికి తెలిపారు. అనంతరం ఆకాశపు వారి వీధిలో ఉన్న మేకల కమేళాను పరిశీలించారు. కమేళా చుట్టుపక్కల ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు.

జోరుగా పూడికతీత పనులు

నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య తెలిపారు. మంగళవారం కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి లోతట్టు ప్రాంతాలలో ఉన్న కాలువలలో పూడికతీత పనులను పారిశుధ్య సిబ్బందితో చేపట్టారు. వర్షాలు కురిసే సమయంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు అధికంగా చేరి చుట్టుపక్కల ప్రాంతాలకు ఇబ్బందులు ఏర్పడ వచ్చన్న అభిప్రాయంతో ముందస్తు జాగ్రత్తలతో వర్షపునీరు ప్రవాహానికి అడ్డంకి లేకుండా చర్యలు చేపడుతున్నారు.

వాకర్స్ క్లబ్‌లు సమాజసేవకు దోహదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాకర్స్ క్లబ్బులు సమాజానికి పట్టుకొమ్మలని డిస్ట్రిక్ట్ -102 గవర్నర్ జామి నారాయణ స్వామి అన్నారు. మంగళవారం ఉదయం కొత్తపేట నీళ్లట్యాంక్ వద్దనున్న మహారాణి అప్పలకొండయాంబ రాక్ గార్డెన్ లో దత్తసాయి వాకర్స్ నూతన క్లబ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన దత్తసాయి వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలుగా సిహెచ్. శేషశైలజ, ప్రధాన కార్యదర్శిగా జి. సంతోషి, కోశాధికారిగా డి.పైడి రాజు, కార్యవర్గ సభ్యులతో నారాయణ స్వామి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక సభ్యులంతా తమ ఆరోగ్యం కోసం నడవటమే కాకుండా సమాజం కోసం అవగాహనా కార్యక్రమాలు,వైద్య శిబిరాలు, చలివేంద్రాలు, అన్నదానం, నేత్ర, రక్తదాన శిబిరాలు, స్వచ్ భారత్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా హాజరైన మాజీ గవర్నర్ కె.సత్యం, వాకర్స్ జిల్లా కోఆర్డినేటర్ జి. కృష్ణంరాజు, మాజీ గవర్నర్ డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మద్యం షాపు తరలించాలని వినతి

బొబ్బిలి: మార్కెట్లో ఏర్పాటు చేసిన మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలించాలని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎక్సైజ్ శాఖ ఎస్‌పి శ్రీనాథుడుకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. మద్యం షాపు తరలించాలని కోరుతూ వారం రోజులుగా స్థానికులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలించాలని మంగళవారం విజయనగరం వెళ్లి వినతి పత్రాలు అందజేశారు. జన నివాసాల మధ్య మద్యం షాపు పెట్టవద్దని శిరీష, పి.రోజా, వి.పల్లవి కోరారు. మద్యం షాపు తరలించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆధార్ శిబిరం తనిఖీ

బొబ్బిలిరూరల్ : పారాది సచివాలయంలో మంగళవారం ఆధార్ క్యాంప్‌ను ఎంపిడిఒ రవికుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆధార్ కార్డులు నవీనీకరణలో తప్పులు దొర్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గ్రామాల్లో బెల్ట్ షాపులపై సమాచారమివ్వాలి

రేగిడి: గ్రామాల్లో టపాసులు, బెల్ట్ షాపులలో మద్యం అమ్మకాలపై సచివాలయ పోలీసులు ఎప్పటికప్పుడు సమాచారం అందివ్వాలని ఎస్ఐ నీలావతి సూచించారు. మంగళవారం రేగిడి పోలీస్ స్టేషన్‌లో సచివాలయ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో దీపావళికి టపాసులు, అమ్మకాలపై నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతలు లోపించకుండా బెల్ట్ షాపులు నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. నాటు సారా, గంజాయి, కొకైన్ మత్తు పదార్థాలు అక్రమ రవాణాపై సమాచారం అందించాలన్నారు. ఇసుక అక్రమ రవాణా పై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పరిమితికి మించి వాహనాలు నడిపితే నంబరు నమోదు చేయాలన్నారు. విలువైన కలప అక్రమంగా ఎవరైనా తరలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా తీర్థయాత్రలకు వెలితే ముందుగా పోలీసులకు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కళాభారతికి గడియారాలు వితరణ

బొబ్బిలి: వివిధ సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న బొబ్బిలి రోటరీ క్లబ్, కారుణ్య సంస్థలు మంగళవారం మరో వితరణ కార్యక్రమాన్ని నిర్వహించాయి. రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు ఆర్థిక సహకారంతో ఏడువేల రూపాయల విలువ చేసే రెండు మెగా గడియారాలను రోటరీ క్లబ్ బొబ్బిలి అధ్యక్షులు శ్రీనివాసన్, పోలియో చైర్ శ్రీహరి, కార్యనిర్వహణ కార్యదర్శి కె.రామకృష్ణలు కళాభారతి ప్రధాన కార్యదర్శి నంబియార్ వేణుగోపాల్, కార్యదర్శి పుల్లెల శ్రీనివాసరావులకు కళాభారతి కార్యాలయంలో అందించారు. రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు మాట్లాడుతూ నిస్వార్థ సేవలకు రోటరీ విశ్వాసనీయమైన సంస్థని తద్వారా బొబ్బిలి, పరిసర ప్రాంత ప్రజలకు వివిధ సేవాకార్యక్రమాలను అందించామని చెప్పారు. నంబియార్ వేణు గోపాల్ రోటరీ, కారుణ్య సభ్యులను అభినందించారు. వీరితో పాటు ఎమ్ శ్రీనివాసరావు, రవి పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి సారించాలి

నెల్లిమర్ల: గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి పి. కూర్మి నాయుడు సూచించారు. మంగళ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు అధ్యక్షతన ప్రత్యేకాధికారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటు వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, సురక్షితమైన తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ జరిపించి నీటి సరఫరా చేయాలన్నారు. కాలువల్లో మురుగు నీరు నిల్వకాకుండ పారిశుధ్య పనులు జరిపించి వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వేయకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు, ఇఒపిఆర్‌డి జి. శంకర జగన్నాథం, ఎంఇఒ యుఎస్ఎన్ మూర్తి, సతివాడ, కొండ వెలగాడ పిహెచ్‌సి వైద్య బృందం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు దారపర్తి గిరిజనుల వినతి

శృంగవరపుకోట: మండలంలోని దారపర్తి గిరిజనులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి జనసేన నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసినాయుడు ఆధ్వర్యంలో దారపర్తి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను రెన్యువల్ చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను రెన్యువల్ చేయకపోతే ఉపాధిహామీ పనులు ఆగిపోయి దారపర్తిలో 7 గిరిజన గ్రామాల అభివృద్ధి, గిరిజనుల ఆదాయం ఆగిపోయి ప్రమాదం ఉందన్నారు. వెంటనే పోస్టులను రెన్యువల్ లిస్టులో పెట్టించాలని కోరారు. అనంతరం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్, డుమా పీడీకి వినతి పత్రాలను అందించారు.

తూతూ మంత్రంగా రీ సర్వే గ్రామ సభ

వేపాడ: మండలంలోని బిటికె రాజపురంలో మంగళవారం తూతూ మంత్రంగా భూముల రీసర్వే గ్రామ సభను నిర్వహించారు. మండల స్థాయి రెవెన్యూ అధికారులు హాజరు కాకుండా భూములు రీ సర్వే నిర్వహించడమే దీనికి తార్కాణం. ఈ గ్రామ సభలో కేవలం మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ గ్రామ సభలో విఆర్ఒ, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

గజపతినగరం: మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ మంగళవారం సందర్శించిన సందర్భంగా డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, సిఐ జివి రమణ ఆధ్వర్యంలో స్టేషన్ ఆవరణలో వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్రోతును కలిసిన యుటిఎఫ్ నాయకులు

భోగాపురం: రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజును మండల యుటిఎఫ్ యూనియన్ నాయకులు సోమవారం పోలిపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని ఆయన అన్నారు. యూనియన్ నాయకులు పడాల చంద్రశేఖర్, ఆళ్ల వైకుంఠ రావు, ప్రసాద్, బెహరా శ్రీనివాసరావు, ఏ రాములప్పుడు, కాశి రాజు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని ఆతవ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ-1 జి. జగదీశ్వరరావు, బానాది పాఠశాలను ఎంఇఒ -2 పి. బాలభాస్కరరావు వేర్వేరుగా సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్స్, వంటగది పరిశీలించారు. తరగతుల టైం టేబుల్స్, ఇయర్ ప్లాన్స్ పరిశీలించి విద్యార్థుల వర్క్ బుక్స్, తెలుగు, ఇంగ్లీష్, చదివించడం రాయించడం, అంకెలు, సంఖ్యలు, చతుర్విధ ప్రక్రియలు చేయించడం, పిఎం పోషన్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాలను పరిశీలించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు డి.కోటేశ్వరరావు, కె.రామప్రసాద్ ఉన్నారు.

పాడి రైతుల ఆందోళన

రాజాం: విశాఖ డెయిరీ యాజమాన్యం పాలు ధర తగ్గించడంపై రాజాం నియోజకవర్గం పాడి రైతులు మంగళవారం పట్టణంలో విశాఖ డైరీ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం ఎన్నడూ లేని విధంగా పాలు ధర ఒకేసారి తగ్గించడం దారుణమన్నారు. పెరిగిన మేత, దాణా ఖర్చుల కారణంగా డెయిరీ ఇస్తున్న పాల ధర గిట్టుబాటు కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విశాఖ డెయిరీ తమ నిర్ణయాన్ని ఉపసంహరించువాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

భోగాపురం: జాతీయ రహదారిపై సుందరపేట వంతెన వద్ద బైక్ బోల్తా పడి గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం రాత్రి మృతి చెందాడు. సిఐ ప్రభాకర్ అందించిన వివరాల ప్రకారం. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్లే రహదారిలో సోమవారం సాయంత్రం బైక్ పై వెళ్తున్న వ్యక్తి బోల్తాపడడంతో వెంటనే అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయం తగలడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో పట్టుబడ్డ యువకుడు

పూసపాటిరేగ : మండలంలోని కందివలస సంత వద్ద మంగళవారం గంజాయితో కందివలసకు చెందిన దేశెట్టి భానుజీ (27) పట్టుకున్నట్లు పూసపాటిరేగ పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 1200 గ్రాముల గంజాయి సీజ్ చేసామని తెలిపారు.

బీచ్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి బీచ్‌కు మంగళవారం గుర్తుతెలియని మృతదేహం కొట్టుకు వచ్చింది. మత్స్యకారులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని విజయనగరం కేంద్ర ఆస్పత్రికి తరలించారు. సముద్రంలో పడి మృతి చెంది రెండు మూడు రోజులు అవడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది.మృతుని ఆచూకీ కోసం పూసపాటిరేగ పోలీసులకు 9121109447 ఫోన్ చేయాలని తెలిపారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఈ నెల 24వ తేదీన రానున్న దానా తుపానుపై అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ యం.శ్రీను అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో విఆర్ఒలు, కార్యదర్శులు, నీటి పారుదల శాఖ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపానుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రైతుకు తగు సూచనలు చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, ఎన్నికల డిటి గౌరిశంకరరావు, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, అధికారులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ తుపాను సందర్భంగగా ముందస్తు చర్యలో భాగంగా అధికారులతో సమావేశం నిర్వహించారు. తుపాను నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో చేపట్టవలసిన విధులు గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, మండల రెవెన్యూ అధికారి రాములమ్మ, ఎపిఒ ఆదిలక్ష్మి, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

భోగాపురం: అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుధారాణి

తీర ప్రాంత గ్రామాల్లోని గర్భిణులను తరలించండి

భోగాపురం: తుఫాను నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల్లోని గర్భిణులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి తెలిపారు. జిల్లా ఉన్నతాధికారి ఆదేశాల మేరకు తుపానుపై మండల స్థాయి అధికారులతో తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా తుపాను నష్టం సంభవిస్తే వెంటనే మండల స్థాయి అధికారులకు తెలియజేయాలని సూచించారు. తహశీల్దార్ సురేష్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. ఎంపిడిఒ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేసుకోవాలని అన్నారు. ఇఒపిఆర్‌డి గాయత్రి, వ్యవసాయ అధికారి హరికృష్ణ, ఎపిఒ ఆదిబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని సారిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళ వారం ఎఒ ఎం.పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహించారు. వరి పంట పొలాలు పరిశీలించి తెగుళ్ల పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో పురుగు, తెగుల్లు నివారణకు ఆకుముడత పురుగుకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందు 400 గ్రాములు, దోమ పోటుకు ఏస్పెట్ మందు 300 మిల్లి లీటర్లు, పాము పొడ తెగులకు హేక్సకనాజోల్ మందు 400 మిల్లి లీటర్లు ఎకరాకు మొక్క మొదల్లు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరులు వ్యవసాయ అధికారి టి. సంగీత, ఎఇఒ నాగరాజు, విఎఎ వేణు, శ్యామ్, సర్పంచ్, ఎంపిటిసి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని వేపాడ, వల్లంపూడి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ సిబి యశ్వంత్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలు గురించి అన్ని సౌకర్యాలు గురించి రైతులకు తెలియజేశారు. అనంతరం రైతులతో కలిసి పోలాన్ని సందర్శించారు. పొలంలో గుర్తించిన పురుగులు, తెగుళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఫాటోస్ బదులుగా జిల్లేడు ద్రావణం వాడుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎ పవన్, రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సన్యాసమ్మ, ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బొండపల్లి: మండలంలోని వెదురువాడ, ఎం.కొత్తవలస గ్రామాలలో మంగళవారం రైతు సేవా కేంద్రల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు రైతులకు చేపట్టవలసిన వివిధ యాజమాన్యం పద్ధతులపై అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయ సాగు ప్రోత్సాహంలో భాగంగా సిబ్బంది పొటాష్ రిలీజింగ్ బ్యాక్టీరియా వాడకం పై ప్రయోగ పూర్వక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చంద్ర శేఖర్ బాబు, మండల వ్యవసాయ అధికారి మల్లికార్జున్, స్థానిక సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకు నాయుడు బాబు, సత్యవతి, పశుసంవర్ధక అధికారులు, పాల్గొన్నారు

డెంకాడ: మండలంలోని జొన్నాడ, బొడ్డవలస గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. వరిలో ఆకుముడత, దోమపోటు, పాము పొడ, అగ్గి తెగులు గుర్తించి నివారణ చర్యలు వివరించారు. సమగ్ర సస్యరక్షణ ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు వి.హరికృష్ణ, నిమత, భారతి పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని తాలాడలో మంగళవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ నవీన్ కుమార్ మాట్లాడుతూ లాభసాటి వ్యవసాయంపై రైతులను చైతన్యం చేస్తున్నామన్నారు. సాగులో పెట్టుబడి తగ్గించడం, పంట దిగుబడి పెంచడం, మంచి ఆదాయం సాధించడమే లక్ష్యంగా పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ లక్ష్మి, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బవిరి శీనుబాబు, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను దూరం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

మాదక ద్రవ్యాలకు ప్రజలను దూరం చేయడానికే సంకల్పం అనే కార్యక్రమం లక్ష్యమని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. సోమవారం రాత్రి ఆరికతోట గాంధీ బొమ్మ సెంటర్ వద్ద స్థానిక ఎస్ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్పాన్ని ప్రజల్లో బలంగా నాటేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నా మన్నారు. గంజాయి, నల్ల మందు, హిరాయిన్, బ్రౌన్ షుగర్ వంటి మత్తు పదార్థాలు నిల్వ చేసినా, రవాణా చేసినా, వినియోగించినా నేరమేనని అటువంటి వ్యక్తుల సమాచారం ఇవ్వాలనీ సూచించారు. పట్టుబడ్డ వ్యక్తులు ఎంతటి వారైనా క్షమించేది లేదని తేల్చి చెప్పారు. రహదారి భద్రత, రోడ్డు నియమాలు పాటించి, వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగం లేకుండా చూసుకోవాలన్నారు. ఇటీవల సైబర్ క్రైమ్‌లు ఎక్కువవుతు న్నాయని, ఇవి మన అజాగ్రత్త వల్లనే జరుగుతున్నాయన్నారు. మహిళలు, బాలికల పట్ల అఘాయిత్యాలకు పాల్పడితే ఫోక్సో కేసులు తప్పవని హెచ్చరించారు. దీపావళి పండగ సందర్భంగా అక్రమ బాణాసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చర్యలు తప్పవన్నారు. అనంతరం సంకల్పం లక్ష్యాన్ని విజయవంతం చేస్తామని ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పల్లా చంద్రరావు, సంఘిరెడ్డి ప్రసాద్, శివుడు, స్వామి నాయుడు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఐటిఐ మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఐటిఐలలో మిగులు సీట్లు కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ జివి రమణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి 26 వరకు iti.ap.gov.in వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబర్‌తో మాత్రమే లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 27న మధ్యాహ్నం 3గంటలకు విజయనగరం, బొబ్బిలి రాజాం ప్రభుత్వ ఐటిఐలకు ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో వెళ్లి వెరిఫికేషన్ చేసుకుని 28న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

సుగర్ ఫ్యాక్టరీ కాలుష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ కాలుష్యంతో మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని చిన్నయ్యపేట గ్రామస్తులు, యువత, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. షుగర్ ఫ్యాక్టరీ పక్కనే తమ గ్రామం ఉందని కాలుష్యం కోరల్లో షుగర్ ఫ్యాక్టరీ నడుస్తుందని యాజమాన్యం పట్టించుకోకపోవడంతో కంటి సమస్యలు, గుండె సమస్యలు, చర్మవ్యాధులు ఇతరత్రా వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఫ్యాక్టరీ ముందు నిరసన తెలిపారు. మంగళవారం గ్రామస్తులు, యువత మహిళలు ప్రజాశక్తికి తమ సమస్యలను వివరించారు. షుగర్ ఫ్యాక్టరీ కాలుష్యంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సోమవారం సాయంత్రం కర్మాగారం గేటు వద్ద ఆందోళన చేపట్టామన్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలకు అనారోగ్య పాలవుతున్నామని అన్నారు. బ్రాయిలర్ నుంచి వచ్చే రేణువులుతో కండ్లు పోతున్నాయని వాపోయారు. వ్యర్థాల నీటిని పంట పొలాలకు వదలడంతో పంటలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నయ్య పేట, సంకిలి, మజ్జి రాముడిపేట గ్రామాల చెరువులలో షుగర్ ఫ్యాక్టరీ అనుబంధ సంస్థ ఇథనల్ కర్మాగారం నుంచి వ్యర్థ పదార్థాలతో పాటు లగున్ 1, 2, 3 నుంచి ఫిల్టర్ మట్టి రసాయనాలు చేరి చెరువులో నీరు తాగి మూగజీవాలు మృతి చెందుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యర్థ పదార్థాలు, రసాయనలతో సుమారు 40 ఎకరాల వరకు పంటలు నాశనమయ్యేయని వాపోయారు. ఫిల్టర్ మట్టి రసాయనాలు నిల్వలు ఉంచడంతో వాటి వల్ల వచ్చే దుర్గంధం భరించలేకపో తున్నామన్నారు. వీటిపై ఎవిపి పట్టాభిరామిరెడ్డి, వారి యాజమాన్యం దృష్టిసారించి నివారించకపోతే భవిష్యత్తులో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న పరిశ్రమ ప్రతినిధులు

అభివృద్ధికి రూ.1.50కోట్లు మంజూరు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50కోట్లు మంజూరు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో 31 వార్డులలో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఇప్పటికే అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్‌తో చర్చించినట్లు చెప్పారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, అనుమతులు వచ్చిన వెంటనే కౌన్సిల్ ఆమోదం పొంది అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మున్సిపాలిటీకు ఇప్పటి వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14.12కోట్లు మంజూరు అయ్యాయని, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులలో రూ.8కోట్లు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కు అభివృద్ధి కోసం, వాటర్ సరఫరా, భైరిసాగరం సుందరీకరణకు వినియోగించామని చెప్పారు. మరో రూ.2.50కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని చెప్పారు. మిగిలిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

కమిషనర్ రామలక్ష్మీ

దోమల మందు పిచికారీ చేయాలి

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రామ పంచాయతీలు పరిశుభ్రంగా ఉంచాలని, కాలువలలో దోమల మందు పిచికారి చేయాలని ఎంపిడిఒ ఎస్ రమణయ్య తెలిపారు. మంగళవారం వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో గల రామలింగాపురంలో ఎంపిడిఒ రమణయ్య, వైద్యాధికారి గోపాలకృష్ణతో కలిసి పర్యటించారు. గ్రామాలలో మలేరియా, డెంగీ, చికెన్ గునియా వంటి జ్వరాలు రాకుండా దోమలు లార్వా దశలోనే ఎలిమినేట్ చేయడానికి స్ప్రేయింగ్ ఉపయోగపడుతుందన్నారు. ఫ్రైడే డ్రై డే పాటించి గోలేలు, కుండీలు వారానికి ఒకసారి కడిగి ఆరబెట్టాలని, ఇళ్ల ముందు కొబ్బరి బొండాలు ప్లాస్టిక్ డబ్బాలు లేకుండా చూడాలని, డెంగీ దోమలు మంచి నీటిలోనే పెరుగుతాయని, పగలే కుడతాయని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెక్కల గౌరీనాయుడు, సెక్రటరీ అప్పారావు, హెల్త్ సూపర్ వైజర్ ఈశ్వరరావు, ఎమ్ఎల్‌హెచ్‌పి గీతిక, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరరావు, ఎఎన్ఎమ్ వరలక్ష్మి, ఆశ వర్కర్స్ జ్యోతి, రాములమ్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెంలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. గ్రామంలో ప్రతి వీధిలోనూ పారిశుధ్యం పనులను పరిశీలించారు. ఒడిఎఫ్‌ప్లస్, తడి పొడి చెత్తను డోర్ టు డోర్ సేకరణపై ఆరా తీశారు. గ్రామాల్లో ప్రజలకు రాబోయే తుపాను గురించి హెచ్చరికలు జారీ చేశారు. ఆయన వెంట సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ గొర్రె రాంబాబు పాల్గొన్నారు.

కొత్తవలస: స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమణయ్య

రోడ్డు విస్తరణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రాజాం

రాజాం మెయిన్ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మెయిన్ రోడ్డు పనులు శరవేగంతో 50 శాతం వరకు పూర్తయిందన్నారు. అనంతరం ఆర్అండ్‌బి అధికారులతో మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గంలో రూ.50 కోట్లతో రోడ్లు, కాలువలు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు దీపావళికి సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు మూడు గ్యాస్ సిలిండర్ల పథకాన్ని కూటం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి, మున్సిపల్, తదితర ప్రభుత్వ అధికారులు, టిడిపి నాయకులు నంది సూరి ప్రకాష్, గురవనా నారాయణరావు, దుప్పలపూడి శ్రీను, బవిరి శీను బాబు, జనసేన నాయకులు యూపీ రాజు, గెడ్డాపు నీలకంఠం, సిత్తురి నాగరాజు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EA 174/2024 in & 13/2016 OS 86/2013

Between :
DHR Petitioner : అందవరపు బదిరినారాయణ
And :
JDR Respondent : మజ్జి సురేష్ కుమార్
To
శ్రీ మజ్జి సురేష్ కుమార్, S/o వెంకటప్పారావు, మల్లిఖార్జున కోలనీ, రాజాం - 532127, విజయనగరం జిల్లా.

పిటిషనర్-డిక్రి హోల్డర్ అయిన అందవరపు బదిరినారాయణ EP Schedule హద్దులు amend చేయిమని పిటిషను కోర్టులో దాఖలు చేయగా కోర్టువారు ఉత్తర్వులు ప్రకారం ఎన్నిసార్లు సమన్లు పంపించినను మీరు అందుకొనక కాలయాపన చేయచున్నారు. పై కోర్టువారు ఈ పబ్లికేషన్ ద్వారా మీకు సమన్లు చేయు నిమిత్తం **తేది 4-11-2024** వాయిదా వేసినందున పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీపై పరోక్షముగా తీర్మానించడమగును.

(బై ఆర్డర్ ఆఫ్ కోర్టు)

ఇట్లు
కె.కొండలరావు
అడ్వకేట్, రాజాం,
సెల్ : 9440531061

రాజాం
తే 18.10.2024ది

IN THE HONOURABLE COURT OF THE III rd ADDL. JUNIOR CIVIL JUDGE - EXCISE COURT AT VIZIANAGARAM
O.S. NO: 90/2020

Between
Sri Jagarapu Appa Rao .....Plaintiff
And
Smt. Bevara Vijayalakshmi and others ......Defendants

TO
SUBSTITUDE NOTICE TO THE DEFENDANTS NO: 1, 3 & 4
1. Smt. Bevara Vijayalakshmi, w/o late Ramu Naidu, R/o Illamnaiduvalsa Village, Maredubaka Post, Rajam Mandal, Srikakulam District. (D-1)
2. Sri. Bevara Thulasi Prasad, S/o late Ramu Naidu, Rest-Do- (D-3)
3. Sri. Bevara Mohan Prasad, S/o late Ramu Naidu, Rest-Do- (D-4)

Please take notice that the above numbered O. S. No: 90/2020 filed by the plaintiff for recovery of the amount due and the said suit is stands posted to 22-11-2024 for your appearance and you are here by ordered to appear before the Court on **22-11-2024 at 10-30 AM** in person or through an advocate or else the matter will be decided in your absence by the Honourable Court.

(BY THE ORDER OF THE COURT)

VARRI DEMUDU BABU
Advocate for plaintiff
VIZIANAGARAM
Cell No: 9440237075

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన అల్లిన లక్ష్మి, W/o నీలంనాయుడు యొక్క శుద్ద క్రయ దస్తావేజు తేది 24-03-2014 రాజాం సబ్‌రిజిష్టర్ వారి కార్యాలయంలో చేయబడిన డాక్యుమెంటు నెం.840/2014 తేది 24-03-2014న మా క్లయింటు ఆయా గ్రామం నుండి రాజాం బస్టాండుకు వస్తున్నప్పుడు రాజాం బస్టాండులో పోయినందున పోలీసు రిపోర్టు కూడా ఇవ్వడం జరిగింది. కావున యావన్మంది ప్రజలకు తెలియజేయడం ఏమనగా ఎవరికైనా దొరికినచో నాకు తెలియజేయవలసినదిగా ఇందుమూలంగా బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడం జరిగింది.

CH. Sankara Rao
Advocate, Rajam,
Cell: 9491322344

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT RAJAM.
I.P. NO. 8 /2022.

BETWEEN:
1.Srungarapu Kiran Kumar
2. 2. Srungarapu Santhamani ....PETITIONERS
AND:-
1. Gollapalli Veerabhadra Rao 45 others. ....RESPONDENTS

To,
R1. Gollapalli Veerabhadra Rao S/o. Appa Rao.
R2. Jillila Rajendra Prasad @ Babu S/o. Papa Rao.
R3. Mutiki Yugandhar S/o. Mallibabu.
R4. Undrala Ramu S/o. Venkata Rao.
RS. Srungarapu Manmada Rao Achary S/o. Late Ramamurty.
R6. Srungarapu Jhansi W/o. Muralidhar Rao.
R7. Lakkoji Dilleswara Rao S/o Late Chinababu.
R8. Lakkoji Ramesh Achary S/o. Raja Rao Achary.
R9. Potnuru Srinivasa Rao S/o. Malleswara Rao.
R10. Perisetty Sriramamurthy S/o. Late Paidi Raju.
R11. Nelli Ravi S/o. Veerabadrudu C/o Laveti Chinnayya.
R12.Chebolu Mohana Rao @ Bujji S/o. Nellayya.
R13. Kadari Bhargava Krishna S/o. Chinnamnaidu
R14. Mutiki Ramesh Babu S/o. Late Mallibabu
R15. Degala Vani W/o Satyanarayana
R16. Bevara Venkata Ramana S/o. Late Narayanappadu
R17. Varada Venkata Narayana Murty S/o. Late Chitti Raju
R18. Yandhuva Venkataram S/o. Kannayya
R19. Buddepu Visweswara Rao S/o. Eswar Rao
R20. Maricharla Murali S/o. Sanyasinaidu
R21. Addanki Murali S/o. Late Satyanarayana
R22. Monthapudi Sankara Rao S/o. Late Sundara Rao
R23. Madugula Danunjay S/o. Appala raju
R24. Varama S/o Ravindra Raju
R25. Kolla Ramesh S/o Late Surya Rao
R26. Karanam Appalaraju S/o Late Accham Naidu
R27. Perla Visweswara Rao S/o Late Venkata Rao
R28. Dasari Chandara Rao S/o Late Sayalingam
R29. Bommana Kesava Rao S/o Veerabadrudu
R30. Senapathi Suchitra W/o Harinath
R31. Chandaka Papa Rao S/o Ramu
R32. Mutiki Mallibabu S/o Appala Raju
R33. Mutiki Prakash S/o Mallibabu
R34. Suru Gurunadham @ Chanti S/o Late Ananda Rao
R35. Gottapu Vamsi Naidu S/o Krishnamurty
R36. Sivva Kiran Kumar Naidu S/o Late Nageswra Rao
R37. Kolla Srinivasa Rao S/o Late Suryanarayana
R38. Kotakota Srinivasa Rao S/o Late Vykunta Rao
R39. Koraneyana Aneesh Naidu S/o Late Jayaram Naidu
R40. Basava Auchuta Rao S/o Late Punchamukheswara Rao
R41. Bandi Narayana Rao S/o Late Venkata Rao
R42. Gedala Joga Rao S/o Late Dhilleswara Rao
R43. Nelli Swami naidu S/o Late Surapunaidu
R44. Saladi Subamma. W/o Late Venkataramana
R45. Desitti Sai Krishna S/o Late Ganapati Rao
R46. Pillala Tirupathi Rao S/o Sanyasinaidu
.....RESPONDENTS

పై నెంబరు పిటిషనర్ తనను ఇన్‌సాల్వెంట్ పర్సన్‌గా డిక్లేర్ చేయించమని కోరుచూ పై కోర్టులో ఐ.పి.8/2022 నెంబరుగా పిటిషను దాఖలు చేయగా సదరు పిటిషన్‌లో పై రెస్పాండెంట్స్‌కు నోటీసు నిమిత్తం మరియు జనరల్ నోటీసు నిమిత్తం పై కోర్టు తేది 4-11-2024 వాయిదా అయి ఉన్నది. కావున ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల **తేది 4-11-2024 పగలు 10-30 గంటల**కు పై కోర్టులో హాజరు అయి మీకుగల ఆక్షేపణలు తెలియపర్చు కోవలెను. లేని యెడల పిటిషనర్ తరుపున శ్రీ కోర్టువారు ఆర్డరు జారీ చేయుదురని యీ బహిరంగ ప్రకటన మూలంగా జన యావన్మందికి తెలియజేయడమైనది.

(బై కోర్టు ఆర్డర్)

K. Kondala Rao
Advocate for the petitioner,
Rajam, Cell: 9440531061